ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మహబూబాబాద్
బుధవారం 1 జనవరి 2025



పశుగణన త్వరగా పూర్తి చేయాలి

జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి కిరణ్ కుమార్

వివరాలు 8లో



కొత్త సంబురం

వెల్‌కం టు-2025

- జిల్లా వ్యాప్తంగా యూత్ క్రేజ్
- రంగులు, కేక్‌ల కొనుగోళ్ల బిజీ
- గ'మ్మత్తు'గా గడుపుతూ.. కేరింతలు
- పోలీసుల ఆంక్షలతో శివారు ప్రాంతాల్లో యువత వేడుకలు

మహబూబాబాద్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : కాలచక్రం గిర్రున తిరిగిపోతోంది.. కొత్త సంవత్సర ఆగమనానికి హ్యాపీ..హ్యాపీగా.. జాలీ.. జాలీగా జిల్లా ప్రజానీకం స్వాగతం పలికింది. గతించిన కాలంలో అనుభవించిన తీపి, చేదు.. వగరు లాంటి గురుతులకు వీడ్కోలు పలుకుతూ.. న్యూ ఇయర్ కొంగ్రొత్త ఆశలతో ఆనందపుటంచులను తాకాలన్న తలంపు యువతలో క్రేజీ నింపింది. 2024 చివరాంకపు అర్ధరాత్రి 12 గంటల క్షణాలను గమ్మత్తు'గా విడిచేస్తూ 2025 నూతన వత్సరపు కాంతి కిరణాలకు స్వాగతిస్తూ.. నిషీధివేళలో యువత కేరింతల సందడి అంబరాన్ని తాకింది. ఈ సారి కొత్తసంవత్సరం బుధవారాన్నే తీసుకురావడంతో అంతా వీకెండ్ తరహాలో కొత్త ఆనందాలను వెతుక్కుంటూ సందడి చేశారు.

రాజకీయంగా వెనక్కి తిరిగి చూస్తే..

రాజకీయంగా స్వరాష్ట్రంలో దశాబ్దకాలం పాటు 'గులాబీ' వెలుగులు.. విరజిమ్మాయి. తర్వాత ప్రజాతీర్పుతో కాంగ్రెస్ అధికారం చేపట్టి ఏడాది దాటిపోయింది. వెనక్కి తిరిగిచూస్తే.. ఏం సాధించాం..? రాజకీయంగా ఎవరు అందలం ఎక్కారు.. ఆపై కొత్తగా లభించిన అభివృద్ధి ఫలాలు ఏమున్నాయి..?! అని 2024లోని పుటలు తిరిగేస్తూ రాజకీయ ఆశావహులు మళ్లీ కొత్త ఆశలతో నూతన సంవత్సరంలోకి అడుగులు వేస్తున్నారు. పార్లమెంటరీ పాలన ఏడాది కావోస్తుండగా అసెంబ్లీ నియోజకవర్గాల పాలన ఏడాది దాటిపోయింది. స్థానిక సంస్థల ఎన్నికలపై ఆశలు పెంచుకున్న రాజకీయ ఔత్సాహికులకు గడిచిన ఏడాది నిరుత్సాహాన్నే నింపింది. సర్పంచ్ ఎన్నికల పాలన కాలం ముగిసి ఏడాది దాటి పోయింది. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఎన్నికలకు 2025 నూతన సంవత్సరం కార్పెట్ పరచబోతోంది. దీనికి తోడు ఎంపీటీసీలు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, జడ్పీ ఛైర్మన్‌లు, మునిసిపాలిటీల ఎన్నికలు కూడా వరుసగా జరిపేందుకు సర్కార్ సన్నద్ధమవుతోంది. ఈ కొత్త సంవత్సరంలోనైనా తమకు కొత్త పదవులు లభిస్తాయన్న ఆశ రాజకీయ భవిష్యత్‌పై ఆశలు పెంచుకున్న వారికి భరోసా కల్పిస్తోంది. ఈ ప్రత్యక్ష ఎన్నికలకు తోడు నామినేటెడ్ పంపకాలు కూడా ఈ ఏడాది ఎక్కడో ఓ చోట బెర్త్ కల్పిస్తాయన్న భావనతో మరికొందరు తమ గాడ్‌ఫాదర్‌లను ప్రసన్నం చేసుకుంటూ నూతన సంవత్సర శుభాకాంక్షల పేరిట వారి మెప్పు పొందేందుకు సన్నద్ధమయ్యారు. ఇలా.. గడిచిన ఏడాది కొందరికి తీయని జ్ఞాపకాలతో.. మరి కొందరికిచేదు అనుభవంగా వీడ్కోలు పలికింది.



మహబూబాబాద్‌లో అమ్మకానికి కేక్‌లు

ఎక్కడికక్కడే.. నయాజోష్..

అర్ధరాత్రి 12 దాటక ఆరంభమయ్యే 2025 కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ.. పాత సంవత్సరానికి వీడ్కోలు చెప్పే క్షణాలు గమ్మత్తు'గా గడుపుతూ.. పలు బృందాలు నయాజోష్‌లో మునిగి తేలాయి. ప్రతీ ఏడాది లాగే రాత్రివేళ తమ హితులు, సన్నిహితులు, బంధుమిత్రులతో పాత సంవత్సరానికి వీడ్కోలు పలికే సమయంలో అంతా ఒకచోట ఉండేలా బృందాలుగా విడిపోయి పార్టీల్లో మునిగితేలారు. కొన్ని బృందాలైతే తలా కొంత పైకం వేసుకుని రాత్రికి మందు, విందుకయ్యే ఖర్చును సిద్ధం చేసుకుని జిల్లాలోని అతి ముఖ్యమైన ప్రాంతాల్లోని తోటల్లో సన్నిహితులతో గడిపేందుకు వెళ్లిపోయారు.



మానుకోటలో అమ్మకానికి తయారుగా ఉన్న రంగులను కొనుగోలు చేస్తున్న మహిళలు

ఇక రాత్రి పార్టీలు అంటే ఇష్టపడని ఆధ్యాత్మిక చింతన కలిగిన వారు మాత్రం కొత్త సంవత్సరం నుంచి తమకు అంతా శుభమే కలగాలని చర్చిలు, ఆలయాలు, దర్గాలు సందర్శించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. దీనికి తోడు అన్ని వర్గాల ప్రజలు కొత్త సంవత్సరంలో స్వీట్ల పంపిణీ, కేకుల కొనుగోలు కోసం ఎగబడ్డారు. కొత్త సంవత్సరానికి స్వాగతం పలికేందుకు మహిళలు సంక్రాంతి వచ్చిందా అన్న భ్రమ కలిగేలా లోగిళ్లలో రంగురంగుల ముగ్గులు వేయడానికి ఉత్సాహం చూపారు. మొత్తానికి మహబూబాబాద్ జిల్లాలో నయా జోష్‌తో అంతా బిజీ..బిజీ అయిపోయారు. జిల్లా కేంద్రంలోనే కాకుండా మండల

మిగతా 8వ పేజీలో...

పోలీస్ ఆంక్షలతో గప్‌చిప్‌గా..

జిల్లాలో పోలీస్ ఆంక్షలతో యువకులు గప్..చిప్‌గా క్యాంపులకు వెళ్లి నూతన సంవత్సర వేడుకలను జరుపుకున్నారు. రాత్రివేళలో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించడంతో పట్టణంలో కాకుండా శివారు ప్రాంతాల్లో తోటల్లో వేడుకలను నిర్వహించి, కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు. 144 సెక్షన్ అమల్లో ఉండడంతో బహిరంగ ప్రదేశాల్లో ఐదుగురి కన్న ఎక్కువ వ్యక్తులు గుమికూడడానికి ఆస్కారం లేకపోవడంతో.. పట్టణంలో ఎక్కడ కూడా గుంపులు.. గుంపులుగా కన్పించలేదు. డీజే సిస్టంలపై నిషేధ ఆంక్షలు ఉండడంతో పెద్దగా సౌండ్‌లు వినిపించలేదు.

కొంచెం కష్టం.. కొంచెం ఇష్టం..

ప్రతీ అడుగు విజయానికి బాసట కాకపోవచ్చు.. అలాగని అపజయం వైపు నడిపిస్తుందని అనుకోలేం.. అదే కొంచెం.. కష్టం.. కొంచెం ఇష్టం... మరికొంత కాలాతీతంగా జరిగే మార్పు. ఇదే కదా జీవితం. అన్నట్టు గడిచిన ఏడాది.. రాబోయే సంవత్సరానికి కొలమానం కాజాలదు. ఎన్నో సంతోషాలు... మరెన్నో వినోదాలు.. కొన్ని దుఃఖాలు.. మరికొన్ని వచ్చి వెళ్లిన విషాదాలు.. కొందరికీ కొత్త రాజకీయ అందలాలు, మరికొందరికీ ఓటమి చేదు అనుభవాలు వెరసి మహబూబాబాద్ 2024 సంవత్సరానికి బై..బై చెబుతూ.. 2025 నూతనవత్సరానికి జిల్లా ప్రజానీకం స్వాగతం పలికింది. ఇప్పటికే అన్ని పార్టీల ఔత్సహికులు తమతమ ఫాలోవర్స్, లీడర్స్‌తో నూతన సంవత్సర విందులు, వినోదాలతో ఆనందంగా గడిపారు. ఎక్కడికక్కడే బృందాలుగా విడిపోయినా యువకులు ముందుగానే తమకు అనుకూలమైన క్యాంపులకు చేరుకున్నారు. రాత్రి తెల్లవారుజాము వరకు నయా సాల్... నయా జోష్ అంటూ మునిగి తేలారు.

కొనుగోలు చేసిన వడ్లను వెంటనే తరలించాలి

కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

గార్ల, డిసెంబరు31 (ఆంధ్రజ్యోతి) : వాతావరణంలో వస్తున్న మార్పులను దృష్టిలో పెట్టుకొని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే సంబంధిత మిల్లులకు తరలించాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ సూచించారు. మంగళవారం సత్యనారాయణపురం, ముల్కనూరు, కేంద్రాల్లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వడ్లకొనుగోలు కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. ఆయా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం మ్యాచర్ ఏ విధంగా ఉంది అని చెక్ చేశారు.

కొనుగోలు చేసిన ధాన్యం వివరాలు ట్యాబ్‌లో ఎంట్రీపూర్తి చేయాలని సూచించారు. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా రైతులకు పట్టాలు అందుబాటులో ఉంచే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తహసీల్దారు కె.రవీందర్, పీఏసీఎస్ సీఈవో సింగు వెంకటేశ్వర్లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

డోర్నకల్‌లో కొనుగోలు కేంద్రాల తనిఖీ

డోర్నకల్, (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తహసీల్దార్ బంజరా, డోర్నకల్, గొల్లచర్లలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ఆకస్మీకంగా సందర్శించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం పెద్దఎత్తున నిల్వ ఉండడాన్ని గమనించిన కలెక్టర్ ఇంకా ఎన్నిరోజులు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వస్తుందని నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. మరో 20 రోజుల పాటు రైతులు ధాన్యాన్ని తీసుకువచ్చే అవకాశం ఉందని నిర్వాహకులు కలెక్టర్‌కు తెలిపారు.



డోర్నకల్‌లో ధాన్యం కొనుగోలుకేంద్రంలో నిర్వాహకులతో అద్వైత్‌కుమార్‌సింగ్

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని వెంటనే రైస్‌మిల్లులకు తరలించేందుకు సహకరించాలని రైతులు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. మునిసిపల్ కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో చెట్లు భారీగా ఉండడంతో ధాన్యం ఆరడంలేదని, ఆ చెట్లను తొలగిస్తే తమకు సరిపడ స్థలం ఉంటుందని రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. తహసీల్దార్ కృష్ణవేణి, మండల వ్యవసాయాధికారి మురళీమోహన్, సెర్ప్ ఏపీఎం శంకర్‌నాయక్, ఏఈవోలు అవినాష్, సీసీలు స్వర్ణలత, రాధ ఉన్నారు.

అక్రమ స్కానింగ్ సెంటర్లపై ప్రత్యేక నిఘా

డీఎంఅండ్‌హెచ్‌వో మురళీధర్

నెహ్రూసెంటర్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఉన్న అక్రమ స్కానింగ్ సెంటర్లపై నిఘా పెట్టినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంఅండ్‌హెచ్‌వో) గుండాల మురళీధర్ అన్నారు. మహబూబాబాద్ డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో మంగళవారం సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోనూ తనంగా దరఖాస్తు చేసుకున్న స్కానింగ్, ఇమేజింగ్ సెంటర్లు ప్రభుత్వ నియనిబంధనల ప్రకారం పనిచేయాలన్నారు. కమిటీ సభ్యుల పరిశీలన, తనిఖీలు ఎప్పటికప్పుడు ఉంటాయన్నారు. ఆయా సెంటర్లలో అర్హత కలిగిన రేడియాలజిస్టులను, లేడీ అంటెండర్, విశ్రాంతి ప్రదేశం, టాయిలెట్స్, తాగునీరు, తదితర సౌకర్యాలు తప్పనిసరిగా ఉండాలన్నారు. ప్రభుత్వం సూచించిన చెక్‌లిస్టు ప్రకారం.. సౌకర్యాలు ఉన్న తర్వాతనే అనుమతులు ఇస్తామని చెప్పారు. జిల్లాలో అవసరం లేకున్నా.. స్కానింగ్‌లు చేస్తే అలాంటి సెంటర్లపై ప్రత్యేక నిఘా పెట్టి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో సారంగం, జగదీశ్వర్, స్రవంతి, చైతన్య, నాగవాణి, నగేష్‌కుమార్, శిరీష, రాజేంద్రప్రసాద్, ప్రసాద్, కెవి.రాజు, అరుణ్‌కుమార్, మనోహర్ పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న మురళీధర్

గర్భిణుల పేర్లు 'ఆన్‌లైన్'లో నమోదు చేయాలి

మరిపెడ, (ఆంధ్రజ్యోతి) : గర్భిణుల పేర్లను ఆయా గ్రామాల ఆరోగ్య సేవకులు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని డీఎంహెచ్‌వో మురళీధర్ ఆదేశించారు. ఆయన మరిపెడ పీహెచ్‌సీని తనిఖీ చేశారు. వైద్యులు, వైద్యసిబ్బందితో సమావేశం నిర్వహించారు. గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవం జరిగేలా సిబ్బంది అవగాహన కల్పించాలని సూచించారు. రక్త పరీక్షలకు జిల్లా ఆస్పత్రికి సిఫార్సు చేయాలన్నారు. షుగర్, బీపీ, ఇతర దీర్ఘకాల వ్యాధులకు చెక్ పెట్టాలన్నారు. మరిపెడ మెడికల్ ఆఫీసర్ రవి, డాక్టర్ స్వామి, సూపర్‌వైజర్లు కృష్ణ, ఆచార్యులు, సుదర్శన్, లక్ష్మీమాధవి, హెల్త్ అసిస్టెంట్ వీరన్న, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పద్మశాలీలు అన్నిరంగాల్లో బలోపేతం కావాలి

సంఘం జిల్లా అధ్యక్షుడు వేముల వెంకన్న

8

నేడు మార్కెట్‌కు సెలవు

మహబూబాబాద్ అగ్రికల్చర్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : నూతన సంవత్సరం సందర్భంగా జనవరి 1న మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌కు సెలవు ప్రకటిస్తున్నట్లు మార్కెట్ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్, వైస్ చైర్మన్ మదన్ గోపాల్‌లోయ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు, వ్యాపారులు, గుమస్తాలు, కూలీలు గమనించాలని, సెలవురోజులో సరుకులు తీసకువచ్చి ఇబ్బందులకు గురికావొద్దని చెప్పారు. గురువారం 2న తిరిగి మార్కెట్ పునఃప్రారంభమవుతుందని చెప్పారు.

గురుకులాల్లో ప్రవేశాలకు
దరఖాస్తుల ఆహ్వానం

పాలకుర్తి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాల్లో 2025-26 విద్యా సంవత్సరానికి ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు గూడూరు ఎస్టీ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ రేణుక తెలిపారు. మంగళవారం మాట్లాడుతూ.. ఐదో తరగతిలో ప్రవేశానికి, బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదలైందని అన్నారు. ఐదో తరగతిలో ప్రవేశానికి 2025 ఫిబ్రవరి 23న ప్రవేశానికి పరీక్ష జరుగుతుందన్నారు. ఆసక్తిగల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల 21న ప్రారంభమైన దరఖాస్తు ప్రక్రియ ఫిబ్రవరి 1 వరకు కొనసాగుతుందన్నారు. ప్రవేశ పరీక్ష రుసుం రూ.100 ఆన్‌లైన్‌లో చెల్లించాలని కోరారు.

ఆర్టీసీ ఉద్యోగులకు ప్రగతిచక్ర అవార్డులు



ప్రశంసాపత్రాలు అందజేస్తున్న డీఎం స్వాతి

జనగామ రూరల్, డిసెంబరు 31(ఆంధ్ర జ్యోతి): జనగామ ఆర్టీసీ డిపోకు చెందిన ఉద్యోగు లకు మంగళవారం డీ ఎం స్వాతి ప్రగతిచక్ర అవార్డులు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈపీకే సాధించిన ముగ్గురు టీం డ్రైవర్లు, ఏడుగురు కండక్టర్లు, ఇంధనం పొదుపు చేసిన 10 మంది డ్రైవర్లు, ఎయిర్‌బస్ మెయింటెనెన్స్ విభాగా నికి చెందిన ఉద్యోగులను ఎంపిక చేసి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఆర్టీసీ బస్సులో ప్రతీ ఒక్కరు సురక్షితంగా ప్రయాణం చేసి ఆర్టీసీకి సహకరించాలని కోరారు.

మెరుగైన సేవలను అందిస్తాం



అదనపు ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ అధికారులు

జనగామ రూరల్, డిసెంబ రు 31(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలను అందిచడమే తమ లక్ష్యమని విద్యుత్ ఏడీఈ వేణు గోపాల్ అన్నారు. జిల్లా కేంద్రం లోని కురుమవాడ సాయిన గర్‌లో మంగళవారం విద్యుత్ అధికారులు అదనపు ట్రాన్స్‌ఫా ర్మర్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ వేసవి ం దృష్ట్యా ఓవర్‌లోడ్ నుంచి ఉపశమనం పొందేందుకు కొత్తగా అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఎక్కడ ఏర్పడిన అధికారులు, సిబ్బంది వెంటనే స్పదించి సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో జనగామ టౌన్-1 ఏఈ బి. సౌమ్య, సబ్ ఇంజనీర్ మనోహర్, లైన్ ఇన్‌స్పెక్టర్ రాంబాబు, ప్రసాద్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందుల్లో 104 ఔట్ సోర్సింగ్ సిబ్బంది

- ఆరు నెలలుగా అందని వేతనాలు
- నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరు

తొర్రూరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో పని చేస్తున్న 104 సిబ్బందికి 6 నెలలుగా వేతనాలు నిలిచిపోయాయి. ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేస్తున్న వీరికి సకాలంలో వేతనాలు అందడం లేదు. దీంతో కుటుంబపోషణ భారమైంది. జీతాలు రాక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారు. జీతాల ఫైల్ ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉండటంతో తామేమీ చేయలేమని జిల్లా అధికారులు చెప్పడంతో ప్రభుత్వం కనికరించాలని 104 సిబ్బంది ఎదురు చూస్తున్నారు.

2008లో నియామకం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నాటి సీఎం రాజశేఖర్‌రెడ్డి 104 వాహనాలను అందుబాటులోకి తీసుకువచ్చి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధికి దూరంగా ఉండి వైద్య సేవలు పొందలేక పోతున్న వారి కోసం గ్రామాల్లో సేవలందించేందుకు 104 వాహనాలు ఏర్పాటు చేశారు. దానిలో ఏఎన్ఎం, ఫార్మాసిస్టు, ల్యాబ్ టెక్నీషియన్, డాటా ఎంట్రీ ఆపరేటర్, డ్రైవర్‌ను నియమించారు. సిబ్బందిని ప్రభుత్వం డీఎంహెచ్‌వో పరిధిలో ఇతర పనులకు వినియోగిస్తున్నారు.





104 వాహనం, నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న సిబ్బంది

ఆరు నెలలుగా అందని వేతనాలు

జిల్లా వ్యాప్తంగా 28 మంది ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన 104లో పని చేస్తున్నారు. వీరి నిర్వహణ జీతాలు, హెచ్‌ఎంఆర్‌ఐ సంస్థ వేతనాలు చెల్లించగా కొన్ని రోజుల క్రితం ఆ సంస్థ తప్పుకుంది. దీంతో ప్రభుత్వం ఏజెన్సీకి 104 బాధ్యతలు అప్పగించింది. ఉద్యోగులకు గతంలో లాగా వేతనాలు రావడం లేదు. 104 ఉద్యోగుల్లో ఫార్మాసిస్టుకు రూ.22,700, డ్రైవర్, డాటా ఎంట్రీ ఆపరేటర్‌కు రూ.17,400, ఇతరులకు రూ.12వేల వేతనం అందుతుంది. వేతనాలు చెల్లించాలని 5 రోజులుగా నల్లబ్యాడ్జీలు ధరించి, విధులకు హాజరవుతున్నారు.

బడ్జెట్ విడుదల కాగానే ఉద్యోగుల ఖాతాల్లో వేతనాలు జమ చేస్తామని ఉన్నతాధికారులు చెబుతున్నారు.

సమగ్ర శిక్షా ఉద్యోగుల వినూత్న నిరసన



మెడకు ఉరివేసుకుని నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

భూపాలపల్లిటౌన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): సమ్మె బాట పట్టిన సమగ్ర శిక్షా ఉద్యోగులు దశల వారీ ఆందోళనలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా సమ్మె శిబిరం వద్ద మంగళవారం వినూత్న నిరసన తెలిపారు. తమను వెట్టిచాకిరీ నుంచి విముక్తి కలిగించాలని మెడకు ఉరి తాడు బిగించుకొని ఆందోళన చేపట్టారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీ సందర్భంగా హామీ ఇస్తూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే సమగ్రా శిక్షా ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని, దానిని ఆయన నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చాంద్‌పాషా, చంద్రకళ, నరేష్, రాజు, తిరుపతి, సుదర్శన్, సతీష్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత, జౌళిశాఖ కమిషనర్‌ను కలిసిన పద్మశాలీ సంఘం



కమిషనర్‌ను సన్మానిస్తున్న పద్మశాలి సంఘం బాధ్యులు

బచ్చన్నపేట, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ చేనేత, జౌళీశాఖ కమిషనర్ శైలజ రామయ్యను మంగళవారం పద్మశాలలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి గుర్రపు బాల్‌రాజు, మండల ప్రచార కార్యదర్శి మంగళంపల్లి కృష్ణమూర్తిలు హైదరాబాద్ నాంపల్లిలోని తన కార్యాలయంలో కలిశారు. శాలువతో సన్మానిం చారు. చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చొరవచూపాలని కోరారు.

లయన్స్ ఆధ్వర్యంలో ఆల్‌ఇన్‌వన్‌ల పంపిణీ

కేసముద్రం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం విలేజ్, ఇంటికన్నె జడ్పీ ఉన్నత పాఠశాలల్లో మంగళవారం లయన్స్‌క్లబ్ జిల్లా జాయింట్ కోఆర్డినేటర్ పుట్ట హరికిషన్‌రెడ్డి సహకారంతో పదో తరగతి విద్యార్థులకు ఆల్‌ఇన్‌వన్ పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈవో కాలేరు యాదగిరి, హెచ్‌ఎం వెంకట్రాంనర్సయ్య, స్థానిక క్లబ్ పాస్ట్ జడ్‌సీలు చిర్రయాకాంతంగౌడ్, చందా గోపి, వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ కె.చంద్రశేఖర్, బెజ్జం ప్రేమ్‌కుమార్, పరాంకుశం శ్రీహరి, లక్కాకుల సత్యనారాయణ, చింతా కరుణాకర్ పాల్గొన్నారు.

పరీక్షకు హాజరయ్యే ప్రతీ విద్యార్థి ఉత్తీర్ణత సాధించాలి

జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్‌రెడ్డి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే ప్రతీ విద్యార్థి ఉత్తీర్ణత సాధించే విధంగా సంసిద్ధులను చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి రవీందర్‌రెడ్డి సూచించారు. మహబూబాబాద్ మండలం అమనగల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఎస్సెస్సీ విద్యార్థులకు బీరవెల్లి రవీందర్‌రెడ్డి-అనిత కుటుంబ సభ్యులు సమకూర్చిన స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ టెన్త్ వార్షిక పరీక్షలకు 80 రోజుల సమయం మాత్రమే ఉన్నదని, ఈ సమయంలో ప్రతీ రోజు విద్యార్థులకు స్లిప్ టెస్టులు నిర్వహించాలని సూచించారు. టెస్టుల్లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి, వారికి వచ్చే సందేహాలను నివృత్తి చేయాలని పేర్కొన్నారు. విద్యార్థులు ప్రతీ రోజు పాఠశాలకు హాజరుకావాలన్నారు. పరీక్షకు హాజరైన ప్రతీ విద్యార్థి 9.6 జీపీఏ సాధించే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఏవో మహంకాళి బుచ్చయ్య, హెచ్‌ఎం కల్లెం వెంకట్‌రెడ్డి, పీఎస్ హెచ్‌ఎం సత్యశంకర్, ఉపాధ్యాయులు దానయ్య, ఫహీమ్, శశిధర్, భరత్‌కుమార్, అనిత, కుమార్, రమేష్, నరేష్ పాల్గొన్నారు.



అమనగల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న డీఈవో రవీందర్‌రెడ్డి

ఉత్తీర్ణత పెంపునకు కృషి చేయాలి

- ఇంటర్ బోర్డు డిప్యూటీ సెక్రటరీ యాదగిరి
- జిల్లాలోని పలు కళాశాలల సందర్శన

జఫర్‌గడ్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి) : జరగబోయే ఇంటర్ వార్షిక పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం పెంపునకు అధ్యాపకులు కృషి చేయాలని ఇంటర్మీడియట్ విద్య రాష్ట్ర డిప్యూటీ సెక్రటరీ యాదగిరి గౌడ్ సూచించారు. జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కె.జితెందర్‌రెడ్డితో కలిసి ఆయన మంగళవారం జఫర్‌గడ్‌తోపాటు జిల్లాలోని జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ ప్రభుత్వ ప్రభుత్వ జూనియర్ కళాశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా యాదగిరి గౌడ్ అధ్యాపక సిబ్బందితో సమావేశమై ఇంటర్ వార్షిక, ప్రయోగ పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. 90 రోజుల ప్రణాళిక అమలు తీరును సమీక్షించారు. కళాశాలలకు రెగ్యులర్‌గా హాజరు కాని విద్యార్థులు, తరగతుల నిర్వహణ వంటి అంశాలపై చర్చించి పలు సూచనలు చేశారు. ఆయా సబ్జెక్టులపై పునశ్చరణ, ప్రత్యేక తరగతుల ద్వారా విద్యార్థులను సన్నద్ధం చేయాలన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. విద్యార్థులు ఎలాంటి భయం, ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా పరీక్షలు రాసేలా చూడాలన్నారు. విద్యార్థులతో ఆయన మాట్లాడుతూ చదువు, విద్యాబోధనపై అడిగి తెలుసుకున్నారు. బోధనలను అవగాహన చేసుకుని పరీక్షలకు పూర్తి స్థాయిలో సిద్ధం కావాలన్నారు. చక్కగా చదవి అందరూ ఉత్తీర్ణత సాధించాలని ఉద్బోధించారు. ఈ సమావేశాల్లో ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.



జఫర్‌గడ్ కళాశాలలో అధ్యాపక సిబ్బందితో మాట్లాడుతున్న ఇంటర్ బోర్డు డిప్యూటీ సెక్రటరీ యాదగిరి

ప్రాణాలు తీసిన మైక్రో ఫైనాన్స్ అప్పు!

● ఒకరి తర్వాత ఒకరు దంపతుల ఆత్మహత్య ● పది రోజుల వ్యవధిలోనే ఇద్దరి బలవన్మరణం ● అనాథగా మారిన ఇద్దరు పిల్లలు

భూపాలపల్లి కృష్ణకాలనీ, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): మైక్రో ఫైనాన్స్‌లో ఆ దంపతులు తీసుకున్న అప్పు వారిద్దరిని బలిగొంది. వేధింపులు తట్టుకోలేక పది రోజుల వ్యవధిలోనే ఇద్దరూ ఆత్మహత్య చేసుకున్నారు. ముందుగా గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన భార్య ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగానే భర్త ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న భార్య మంగళవారం మృతి చెందింది. ఈ వరుస సంఘటనలు భూపాలపల్లి జిల్లాలో చోటుచేసుకున్నాయి. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి మండలంలోని కమలాపూర్ గ్రామానికి చెందిన బానోత్ దేవందర్ (37), చందన (32) అదే గ్రామంలో కూలినాలి చేసుకుంటూ ఇద్దరు పిల్లలను పోషించుకుంటున్నారు. కొద్ది రోజుల క్రితం వీరు కుటుంబ అవసర నిమిత్తం మైక్రో ఫైనాన్స్‌లో రూ. 3 లక్షల అప్పు తీసుకున్నారు. ఆ డబ్బులు కిస్తీలు వారం వారం కట్టాల్సి ఉండగా చెల్లించడం వీరికి కష్టతరమైంది. అప్పు ఇచ్చిన మైక్రో ఫైనాన్స్ నుంచి ఒత్తిడి పెరగడంతో ఆ బాధను తట్టుకోలేక చందన డిసెంబరు 6న పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. దీంతో కుటుంబ సభ్యులు ఆమెను వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. భార్య చందన చికిత్స పొందుతుండగానే భర్త దేవేందర్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో డిసెంబరు 20న ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. చికిత్స పొందుతున్న చందన మంగళవారం మృతి చెందింది. తన కూతురు ఆర్థిక ఇబ్బందులలో ఆత్మహత్య చేసుకుందని మృతురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. అయితే.. చందన, ఆమె భర్త ఆత్మహత్యకు మైక్రో ఫైనాన్స్ వేధింపులే కారణమని గ్రామస్థులు పలువురు ఆరోపిస్తున్నారు.



అనాథలుగా మారిన పిల్లలు





మృతిచెందిన భార్యభర్తలు బానోత్ దేవేందర్, చందన(ఫైల్)

అనాథగా మారిన ఇద్దరు పిల్లలు

దేవందర్, చందన దంపతులకు ఆరు, తొమ్మిదేళ్ల వయసు ఉన్న ఇద్దరు కుమారులు ఉన్నారు. తల్లిదండ్రులు ఇద్దరూ ఒకరి తర్వాత ఒకరు ఆత్మహత్య చేసుకోవడంతో ఆ పిల్లలు అనాథలయ్యారు. శిథిలమైన ఇల్లు తప్ప ఈ పిల్లకు ఎలాంటి ఆసరా లేదని, వీరిని ప్రభుత్వం, దాతలు ఆదుకోవాలని గ్రామస్థులు, బంధువులు కోరుతున్నారు.

ఇద్దరిపై పోక్సో కేసు నమోదు

డోర్నకల్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : బాలికపై అత్యాచారయత్నానికి పాల్పడిన ఓ వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ రాజేష్‌నాయక్ మంగళవారం తెలిపారు. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక (15) ఒంటరిగా ఇంట్లో ఉండగా, అదే గ్రామానికి చెందిన సురేష్ అనే వ్యక్తి బాలికపై అత్యాచారయత్నానికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని బాలిక తమ కుటుంబసభ్యులకు తెలపడంతో వారు డయల్ 100కు, చైల్డ్‌లైన్‌కు ఫోన్‌చేసి సమాచారం అందించినట్లు చెప్పారు. చైల్డ్‌లైన్ సంస్థ వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడుపై పోక్సో కేసు చేసినట్లు సీఐ తెలిపారు.

● మండలంలోని ఓ గ్రామపంచాయతీకి చెందిన మైనర్ బాలికపై ఓ యువకుడు లైంగిక దాడికి పాల్పడినట్లు సీఐ రాజేష్‌నాయక్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం. బాలిక (14)పై వీరన్న అనే యువకుడు లైంగికదాడికి పాల్పడడంతో తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వీరన్నపై పోక్సో కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

గాయపడిన వ్యక్తి మృతి

ఇనుగుర్తి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన వర్దోలు సతీష్ (36) ఈనెల 27న మద్యం సేవించి రోడ్డుపై కళ్లు తిరిగి వెనుకకు పడిపోవడంతో తలకు తీవ్ర గాయమై చికిత్సపొందుతూ మంగళవారం మృతి చెందినట్లు కేసముద్రం ఎస్ఐ మురళీధర్‌రాజ్ తెలిపారు. మృతుడి భార్య అనూష నాలుగేళ్ల క్రితం మృతి చెందగా, అప్పటి నుంచి మద్యానికి బానిసైనట్లు వివరించారు. ఈ మేరకు మృతుడి తండ్రి సాయిలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కోన్నారు. మృతుడికి తొమ్మిదేళ్ల కుమార్తె వైష్ణవి ఉండగా, తల్లిలేని ఆ చిన్నారి తన తండ్రికి తలకొరివి పెట్టడం కంటతడి పెట్టించింది.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి

తొర్రూరు రూరల్, (ఆంధ్రజ్యోతి) : వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన ఫత్తేపురం గ్రామ శివారులో మంగళవారం చోటు చేసుకుంది. తొర్రూరు పోలీసుల కథనం ప్రకారం. మాటేడు నుంచి తొర్రూరు వస్తున్న సుమారు 53 సంవత్సరాల వ్యక్తిని భారీ వాహనం ఢీకొట్టినట్లు చెప్పారు. ఈ ప్రమాదంలో వ్యక్తిముఖం ఛిద్రమైంది. మృతుడు సుమారుగా 5ఫీట్ల ఎత్తు, నల్ల బనియన్, గోధుమ కలర్ పాయింట్ ధరించి మెడలో రాగిబొమ్మ ఉన్న నల్లటి దారం ఉన్నట్లు తెలిపారు. మృతదేహాన్ని తొర్రూరు మార్చురీలో భద్రపరిచినట్లు ఎస్సై రాంజీనాయక్ తెలిపారు.

మహిళపై దాడి కేసులో వ్యక్తి ఏడేళ్ల జైలు

కురవి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : వివాహితపై కత్తితో దాడి చేసి, మూడు తులాల బంగారు అభరణాలు ఎత్తుకెళ్లిన ఘటనలో నర్సింహులపేట మండలం పెద్దనాగారం గ్రామశివారు అమీర్‌తండాకు చెందిన బానోత్ సలీంకు ఏడేళ్ల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానాను విధిస్తూ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు జడ్జి సి.సురేష్ మంగళవారం తీర్పునిచ్చారు. కోర్టు హెడ్‌కానిస్టేబుల్ అశోక్‌రెడ్డి తెలిపిన సమాచారం ప్రకారం. కురవి మండలం ఎలకచెట్టుతండ శివారు భద్రుతండాకు చెందిన బాదావత్ రమేష్ భార్య చందన 2018 అక్టోబర్ 9న తమ వ్యవసాయ పొలంలో పని చేసుకుంటోంది. ఈ క్రమంలో అదే దారి వెంట ద్విచక్రవాహనంపై వెళ్తున్న బానోత్ సలీం పొలంలో ఉన్న చందనపై కత్తిదాడి చేసి, మెడలో పుస్తెలు, చెవి కమ్మలు (సుమారు 3 తులాల బంగారు అభరణాలు) లాక్కొని కత్తితో మెడపై దాడికి పాల్పడినట్లు చెప్పారు. ఈ క్రమంలో చందన కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు రావడంతో సలీం అక్కడ్నుంచి పారిపోయాడు. దీంతో చందన కురవి పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకే అప్పటి ఎస్సై నాగభూషణం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అప్పటి సీఐలు ముత్తిలింగం, వెంకటరత్నం చార్జీషీట్ దాఖలు చేశారు. ప్రస్తుత ఎస్సై గండ్రాతి సతీష్ సాక్షులను ప్రవేశపెట్టగా నిందితుడు సలీంకు ఏడేళ్ల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు జడ్జి సి.సురేష్ తీర్పు వెల్లడించినట్లు చెప్పారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య



లోకేశ్వర్ (ఫైల్)

గూడూరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక ఇబ్బందులు తాళలేక మానసిక ఒత్తిడికి గురైన ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మహబూబాబాద్ జిల్లా గూడూరు శివారు గడివాడలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై గిరిధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం. సమ్మెట లోకేశ్వర్ (51)కు రెండెకరాల వ్యవసాయ భూమి ఉంది. అందులో వరి పంటను సాగు చేశాడు. గతంలో తన ఇద్దరు కుమార్తెలు రుషిత, సుచరితల వివాహం కోసం తెచ్చిన సుమారు రూ.5 లక్షల వరకు అప్పులు పెరిగిపోవడంతో అవి ఎలా తీర్చాలని ప్రతీరోజు మానసికంగా ఇబ్బందులు పడుతుండేవాడని చెప్పారు. గతంలో రెండుసార్లు ఇలా ఆత్మహత్యాయత్నం చేయగా కుటుంబసభ్యులు కాపాడి ధైర్యం చెప్పారు. బొంబాయి కుంట సమీపంలో తన పంటక్షేత్రంలో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇది గమనించిన స్థానికులు కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన అక్కడికి చేరుకుని పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న ఎస్సై గిరిధర్‌రెడ్డి మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు మార్చురీకి తరలించారు. ఇదిలా ఉండగా మృతుడు లోకేశ్వర్ మొదటి భార్య నీల గత నాలుగేళ్ల క్రితం పాముకాటుతో మృతి చెందడంతో ఏడాది తర్వాత లోకేశ్వర్ జయలతను రెండో వివాహం చేసుకున్నాడు. జయలత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్ర ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు

● మానుకోట ఎంపీ పోరిక బలరాంనాయక్



మహబూబాబాద్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం, మానుకోట పార్లమెంటరీ నియోజకవర్గ ప్రజలకు స్థానిక ఎంపీ పోరిక బలరాంనాయక్ మంగళవారం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. 2025 నూతన సంవత్సరంలో ప్రజలందరికి ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలు ప్రసాదించాలని దేవుడిని ప్రార్థించారు. నూతన సంవత్సరమంతా ప్రజలందరికి శుభం జరగాలని, ఉన్నత లక్ష్యాలను చేరుకునే దిశగా నూతన ఉత్సాహంతో అడుగులు వేయాలని ఆకాంక్షించారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..





ఘనంగా కొత్త సంవత్సరం వేడుకలు

హనుమకొండ, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): 2025 సంవత్సరానికి ప్రజలు కోటి ఆశలతో స్వాగతం పలికారు. 12గంటలకు పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ నూతన సంవత్సరాన్ని సాదరంగా ఆహ్వానించారు. కొత్త సంవత్సరంలో అన్ని శుభాలే జరగాలని, అందరూ సంతోషంగా, సుఖంగా ఉండాలని ఆకాంక్షిస్తూ వ్యాట్సాప్ సందేశాలు వెల్లువెత్తాయి. హ్యాపీ న్యూయర్ అంటూ జనం ఆనందోత్సాహాలతో కేరింతలు కొట్టారు. 2025 ప్రవేశానికి శుభసూచనగా పెద్దఎత్తున బాణాసంచాను పేల్చారు. కేకులు కట్ చేశారు. స్వీట్లను పంచుకున్నారు. పరస్పరం ఆలింగనం చేసుకున్నారు. సంతోషంతో నృత్యాలు చేశారు. కొత్త సంవత్సరాన్ని స్వాగతిస్తూ పాటలు పాడారు. అపార్టుమెంట్ల సెల్లార్లు, ప్రభుత్వ, ప్రైవేటు హాస్టళ్లు, పేరున్న స్టార్‌హోటళ్లు న్యూ ఇయర్ వేడుకలతో సందరడిని సంతరించుకున్నాయి.

ముస్తాబు

2025కు స్వాగతం పలుకుతూ నగరంలోని వివిధ వ్యాపార సంస్థలను రంగు రంగుల విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. చర్చీలు, కొన్ని దేవాలయాలను కూడా ముస్తాబు చేశారు. నగరంలోని ప్రధాన కూడళ్లను, కొన్ని ప్రభుత్వ ప్రధాన కార్యాలయాలను కూడా విద్యుత్‌దీపాలతో అలంకరించారు. పలు చోట్ల కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ కార్యకర్తలు తమ నేతల ఫోటోలతో 2025 సంవత్సరానికి స్వాగతం పలుకుతూ బ్యానర్లు, ఫ్లెక్సీలు కట్టారు.

కిటకిటలాడిన మార్కెట్లు

కొత్త సంవత్సరం ప్రవేశం సందర్భంగా కొనుగోలుదారులతో మార్కెట్లు కిటకిటలాడాయి. 2025 సంవత్సరానికి స్వాగతం పలుకుతూ తెల్లవారుజుమునే ఇళ్ల ముందు ముగ్గులు వేయడానికి మహిళలు వివిధ రకాల రంగులను, అలాగే కొత్త సంవత్సరం సందర్భంగా ఆలయాల్లో పూజలు చేయడానికి ఒక రోజు ముందే ప్రజలు పూలు, ఇతర పూజాద్ర వ్యాలను కొనుగోలు చేయడం కనిపించింది. స్నేహితులకు, బంధుమిత్రులకు బహుమతులు ఇవ్వడానికి యువతీ యువకులు రకరకాల గిఫ్టులను కొనుగోలు చేశారు.





మంత్రి సురేఖ శుభాకాంక్షలు

వరంగల్ సిటీ, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అటవీ, దేవాదాయ, పర్యావరణశాఖ మంత్రి కొండా సురేఖ రాష్ట్ర ప్రజలకు ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. లక్ష్య సాధనలో ప్రయత్న లోపం లేకుండా కృషి చేస్తూ ఆనందంగా ఉండడమే అర్థవంతమైన జీవితమని పేర్కొన్నారు. యువత లక్ష్యాలను నిర్ధారించుకుని ముందుకు సాగాలని సూచించారు. ఈ నూతన సంవ్సతరంలో ప్రతీ ఒక్కరి ఆశలు, ఆకాంక్షలు నెరవేరాలని, అందరి జీవితాల్లో వెలుగులు నిండాలని మంత్రి ఆకాంక్షించారు.

హనుమకొండ కలెక్టర్..

హనుమకొండ కలెక్టరేట్: జిల్లా ప్రజలకు హనుమకొండ కలెక్టర్ పి. ప్రావీణ్య నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరంలో జిల్లా ప్రజలు మరిన్ని విజయాలు సాధించాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. అన్ని తరగతుల విద్యార్థులు బాగా చదు వుకుని మంచి ఫలితాలు సాధించాలన్నారు. కొత్త సంవత్సరం 2025లో హనుమకొండ జల్లాను ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు అందరి సహ కారంతో మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానన్నారు. అభివృద్ధికి జిల్లా ప్రజలందరు సహకరించాలని కలెక్టర్ ప్రావీణ్య కోరారు.



వరంగల్ చౌరస్తాలో రంగులు విక్రయిస్తున్న దృశ్యం



నూతన సంవత్సరం సందర్భంగా భక్తుల కోసం విక్రయానికి లడ్డూలు సిద్ధం



కేక్‌ల అమ్మకాలతో బేకరీల సందడి

కొత్త సంవత్సర వేళ ముస్తాబైన ఆలయాలు

వరంగల్ కల్చరల్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని మంగళవారం సాయంత్రం నుంచే వేడుకలు ప్రారంభమయ్యాయి. ముంగిళ్లలో రంగురంగుల ముగ్గులు వేసేందుకు భారీగా రంగులు కొనుగోలు చేశారు. యువత పెద్ద ఎత్తున కేక్‌లు కొనుగోలు చేస్తారని ముందస్తుగా బేకరీల్లో ప్రత్యేక కేక్‌లు తయారు చేసి అందుబాటులో ఉంచారు. ఇక అర్ధరాత్రి 12 గంటలకు బాణసంచా కాల్చే విషయంలో పోలీసులు ఆంక్షలు విధించడంతో యువత అందుకు దూరంగానే ఉన్నారు.

ఆలయాల ముస్తాబు

ఆంగ్ల సంవత్సరాన్ని పురస్కరించుకొని నగరంలో దేవాలయాలను ముస్తాబు చేశారు. చారిత్రక భద్రకాళి దేవాలయం అమ్మవారిని అందంగా అలంకరించి ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేశారు.

వేలాది సంఖ్యలో భక్తులు తరలి వస్తారని ముందస్తుగా ఆలయ అధికా రులు లడ్డూలు తయారు చేసి అందుబాటులో ఉంచారు. ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు.

వాహనాల తనిఖీలు

ఆంగ్ల సంవత్సరాన్ని పురస్కరించుకొని నగరంలోని స్టేషన్‌రోడ్డు, చౌరస్తా, పోచమ్మ మైదాన్, కాశిబుగ్గ, ఇతర ప్రాంతాల్లో అడుగడుగునా పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు నిర్వహించారు. మోటారు సైకిళ్లపై స్పీడ్‌గా వెళ్లవద్దని, బహిరంగ ప్రదేశాల్లో డీజేలు, సౌండ్ సిస్టంలను నిషేధించారు. రాత్రి వేళల్లో రోడ్లపై గొడవలు సృష్టించినా, మద్యం సేవించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఇంతెజార్‌గంజ్ సీఐ షుకూర్ హెచ్చరించారు.

కోటి ఆశల కొత్త యేడు!

2025లో పెండింగ్ సమస్యలకు పరిష్కారం లభించేనా?



హనుమకొండ, డిసెంబర్ 31 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలు, ప్రజాప్రతి నిధులు, రాజకీయ నాయకులు, ఉద్యోగులు కోటి ఆశలు, కొత్త లక్ష్యాలతో కొత్త సంవత్సరం-2025లోకి అడుగు పెడుతున్నారు. కనీసం 2025 లోనైనా తమ సమస్యలు పరిష్కారం కాగలవన్న ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు.

రేషన్ కార్డులకు మోక్షం లభించేనా?

సంక్రాంతి తర్వాత రేషన్‌కార్డులు లేనివారందరికీ ఇస్తామని ప్రభుత్వం నమ్మకంగా చెబుతోంది. దీంతో ప్రజలు ఈ కొత్త సంవత్సరంలో తమ రేషన్‌కార్డుల పరేషాన్ తొలగిపోయినట్టేనని భావిస్తు న్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత గత సంవత్సరం డిసెంబ ర్ 28 నుంచి జనవరి 6 వరకు ప్రభుత్వం నిర్వహించిన ప్రజా పాలనలో తెల్లరేషన్ కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరించింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 48వేలకుపైగా దరఖాస్తుల చేసుకున్న ట్టు అంచనా. ఉమ్మడి జిల్లాలో 1.80లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రస్తుతం ఉమ్మడి మొత్తం 8.9 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయి. అర్హులైన వారు మరో 3 లక్షల మంది వరకు ఉండవచ్చునని అంచనా.



నీడ దొరికేనా?

2025 సంవత్సరంలో కనీసం ఇందిరమ్మ ఇళ్లయినా దక్కాలని గూడులేని ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు. బీఆర్ఎస్ హయాంలో పదేళ్లుగా డబుల్ బెడ్‌రూమ్ ఇంటి కోసం కళ్లుకాయలు కాసేలా ఎదురు చూసి చివరికి నిరాశకు లోనయ్యారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇందిరమ్మ పథకం కింద ఇళ్లులేని నిరుపేదలకు ఇళ్లు ఇవ్వనున్నట్టు ప్రకటించింది. దరఖాస్తులను స్వీకరించింది. ప్రస్తుతం లబ్ధిదారుల ఎంపికకు ఇందిరమ్మ ఇళ్ల సర్వే జరుగుతోంది. సంక్రాంతి తర్వాత ఇళ్ల మంజూరు ఉంటుందని ప్రభుత్వం చెబుతోంది. దీంతో నిలువనీడలేని నిరుపేదలు ఇందిరమ్మ ఇళ్లపై ఆశలు పెట్టుకున్నారు. ఈ యేడైనా తమకు ఇల్లు ఇస్తుందన్న నమ్మకంతో ఉన్నారు.



నగరంలో అభివృద్ధి పనులు

వరంగల్ అభివృద్ధి దిశగా ఈ ఏడు అడుగులు పడగలవన్న ఆశతో నగర ప్రజలు ఉన్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వం గత సంవత్సరమే రూ.6,115 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించింది. రింగ్ రోడ్డు, మామునూరు ఎయిర్‌పోర్టుకు భూసేకరణ, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీకి డీపీఆర్ సిద్ధం చేయడం మొదలైంది. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న మాస్టర్‌ప్లాన్ ఆమోదం పొందింది. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మంజూరైంది. మామునూరు ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు అదనంగా స్థల సేకరణకు జీవో జారీ అయింది. ఇన్నర్, ఔటర్ రింగ్ రోడ్ల ప్రతిపాదనలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీనితో ఈ ఏడు నగరాభివృద్ధి శరవేగంగా జరుగగలదని, మౌలిక సుదుపాయాలు మరిన్ని అందుబాటులో రాగలవన్న విశ్వాసంతో నగర ప్రజలు ఉన్నారు.

అసంపూర్తి పనులు పూర్తి

ఉమ్మడి జిల్లాలో అసంపూర్తిగా మిగిలిపోయిన పనులకు 2025లో మోక్షం లభించగలదన్న విశ్వాసంతో ప్రజలు ఉన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల్లో చాలావరకు పూర్తికాలేదు. వరంగల్‌లోని పాత సెంట్రల్ జైలు స్థలంలో రూ.1100 కోట్లతో చేపట్టిన సూపర్ స్పెషాలిటీ భవనం, కాజీపేటలోని ఫాతిమానగర్ బ్రిడ్జి, వరంగల్ నగరం చుట్టూరా చేపట్టిన ఔటర్ రింగ్ రోడ్డు , వరంగల్ బస్టాండ్, స్మార్ట్ రోడ్డు పనులు, గీసుగొండ సమీపంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటగ్రేటెడ్ టెక్స్‌టైల్ పార్క్, సీపీ కార్యాలయం ఆవరణలో కమాండ్ కంట్రోల్ భవనం, వడ్డెపెల్లి బండ్ సుందరీకరణ, వరంగల్‌లో కలెక్టర్ కార్యాలయం భవనం పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. కొత్త సంవత్సరంలో ఈ పనులకు మోక్షం లభించగలదన్న ఆశతో ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులూ ఉన్నారు. జనగామ జిల్లాలో ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న టెక్స్‌టైల్ పార్క్, అలాగే స్టేషన్‌ఘన్‌పూర్‌లో లెదర్ పార్క్, కొడకండ్లలో టెక్స్‌టైల్ పార్క్‌ల ఏర్పాటుకు 2025లో అయినా మోక్షం కలగాలని ప్రజలు కోరుకుంటున్నారు. నత్తనడకన సాగుతున్న చెన్నూరు రిజర్వాయర్ పనులు కనీసం ఈ ఏడైనా వేగం పుంజుకోవాలని అభిలషిస్తున్నారు.



గ్రీటింగ్ కార్డు యాదిలో..

- ఒకప్పుడు న్యూ ఇయర్ తెలిపే మాధ్యమం
- ఇప్పుడంతా సోషల్ మీడియా ట్రెండే..
- జ్ఞాపకాలను నెమరువేసుకుంటున్న పాత తరం



హనుమకొండ సిటీ, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): న్యూ ఇయర్ వస్తోందనగానే మదిలో తొలుత మెదిలేది అందరికీ గ్రీటింగ్స్ చెప్పాలనే ఆలోచనే. వారం నుంచే ఈ సందడి నెలకొంటుంది. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియచేయడంలో కలిసి ఉన్న బంధాలు మరింత బలపడతాయి. విడిపోయిన బంధాలు మళ్లీ వికసించడానికి దోహదపడతాయి. ఇందుకు గడిచిన కాలంలో అయినా.. ప్రస్తుత తరుణంలో అయినా వారధిగా నిలిచేది గ్రీటింగ్ కార్డ్. అయితే కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలియచేయడంలో ఒకప్పుడు గ్రీటింగ్ కార్డు వేదికగా ఉంటే.. నేటి హైటెక్ యుగంలో సోషల్ మీడియా నిలిచింది. శుభాకాంక్షలు తెలిపే మార్గం మారిన నేపథ్యంలో పాత తరం వారి కాలం నాటి గ్రీటింగ్ కార్డు జ్ఞాపకాలను కొత్త సంవత్సర వేళ నెమరేసుకుంటుండగా.. నేటి యువత సోషల్ మీడియా వేదిక ద్వారా న్యూ ఇయర్ గ్రీటింగ్ తెలిపే ఫీలింగ్స్‌ను ఎంజాయ్ చేస్తున్నారు.

గ్రీటింగ్ కార్డ్ యాదిలో..

2020కి ముందు న్యూ ఇయర్ ట్రెండ్‌ను పాత తరం నెమరేసుకుంటూ నూతన సంవత్సర సెలబ్రేషన్స్‌లో పాల్గొంటోంది. ఎక్కడ నలుగురు ఒక్క చోటకు చేరినా.. ఈ విషయాన్ని చర్చిస్తున్నారు. మన రోజుల్లో ఎలా ఉండేది.. అంటూ సాగే సంభాషణ కళ్లకు కట్టినట్లు ఆవిష్కరించుకుంటూ ఆ జ్ఞాపకాల లోతుల్లోకి వెళుతున్నారు. గ్రీటింగ్ కార్డు అందుబాటులో లేకుంటే పోస్టు కార్డు.. లేదా ఇన్ లాండ్ లేటర్ ద్వారా కూడా పెద్ద పెద్ద అక్షరాలతో హ్యాపీ న్యూ ఇయన్ అని మాత్రమే రాసి తెలిపే వాళ్లం.. అంటూ పెద్దలు జ్ఞాపకం చేసుకుంటున్నారు. గ్రీటింగ్‌కార్డు కొనాలంటే డిసెంబరు 15వ తేదీ నుంచే సిద్ధపడే వాళ్లమంటున్నారు. ఎందుకంటే దూర ప్రాంతాలకు పోస్టు చేమడానికి ముందే తీసేసుకునే వాళ్లమంటున్నారు. కార్డు సెలక్షన్స్ కోసం బుక్ స్టాల్స్ గ్రీటింగ్ కార్డు విక్రయించే గిఫ్ట్ సెంటర్లకు వెళ్లి అరగంటకు పైగా సమయం తీసుకొని సెలక్షన్ చేసుకునే వాళ్లమంటున్నారు. ఇక ప్రేమికులకు అయితే గ్రీటింగ్ కార్డు వెరీ వెరీ స్పెషల్ అంటున్నారు. గ్రీటింగ్ కార్డు ఇవ్వడం ప్రేమను వ్యక్తం చేయడానికి ఒక మార్గంగా ఉండేదంటున్నారు. అప్పటికే ప్రేమికులు అయితే.. కార్డు స్పెషల్‌గా ఉండే సెలక్షన్స్‌లో పోటీ పడే వాళ్లమంటూ ఓల్డ్ జనరేషన్ గుర్తు చేస్తూ.. నూతన సంవత్సర వేళ గ్రీటింగ్ కార్డు జ్ఞాపకాలను వ్యక్తం చేస్తూ కొత్త సంవత్సరంలోకి అడుగిడుతున్నారు. మారిన ట్రెండ్‌ను ఫాలో అవుతూ ఇక మేము కూడా సోషల్ మీడియాను ఫాలో కావాల్సిందే కదా.. అంటూ న్యూ ఇయర్‌కు వెల్‌కం చెబుతున్నారు.



సోషల్ మీడియా వేదికగా నేటి తరం

ఇప్పుడంతా సోషల్ మీడియా ప్రపంచం. కొత్త సంవత్సర వేళ వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ ఇతరత్రా సోషల్ మీడియా ద్వారా న్యూ ఇయర్ గ్రీటింగ్స్ తెలియచేస్తున్నారు. ఇంట్లో పెద్దలు ఉంటే వారి జ్ఞాపకాలను వింటూ.. ఇప్పుడంతా సోషల్‌మీడియా ట్రెండ్.. అంటూ ఆ మార్గంలో గ్రీటింగ్స్ చెబుతున్నారు. పాత, నేటి తరం గ్రీటింగ్స్ జ్ఞాపకాలు, అనుభవాలతో కొత్త సంవత్సరంలోకి సందడిగా ప్రవేశిస్తున్నారు.



మానుకోట పట్టణంలో పీఆర్టీయూ-టీఎస్ 2025 నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి



మహబూబాబాద్‌లో టీపీటీఎఫ్-2025 నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారి రవీందర్‌రెడ్డి

ప్రభుత్వ స్కూళ్లను బలోపేతం చేయాలి : డీఈవో

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి రవీందర్‌రెడ్డి సూచించారు. మహబూబాబాద్‌లో మంగళవారం టీపీటీఎఫ్-2025 నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రతీ ఉపాధ్యాయుడిపై ఉం దన్నారు. విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలలకు వచ్చే విధంగా చూస్తూ నాణ్యమైన విద్యనందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీ రాజేశ్వర్, ఎంఈవో బుచ్చయ్య, జీసీడీవో విజయకుమారి, టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కవిత, నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, ఘైస శ్రీనివాస్, శ్రీశైలం, ఉపేందర్, శ్రీనివాస్, రామలింగారెడ్డి, బాబురావు, విద్యాసాగర్, విజయ్‌కుమార్, గిరిజ, కార్తీక్, రహీముద్దీన్, రఘువేందర్, సునీత పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు

మరిపెడ (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఇష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని డీఈవో రవీందర్‌రెడ్డి అన్నారు. మరిపెడ బంగ్లాలోని సీతారాంపూర్ హైస్కూల్ టెన్త్ విద్యార్థులకు ఆ స్కూల్ హెచ్‌ఎం రాంచంద్రయ్య తన తండ్రి భిక్షమయ్య జ్ఞాపకార్థం రూ.25 వేల విలువైన ఆల్‌ఇన్‌వన్, ఇతర స్టడీ మెటీరియల్ అందించారు. వాటిని డీఈవో 104 మంది టెన్త్ విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. తల్లిదండ్రులు చెమటోడ్చి పిల్లలను చదివిస్తున్నారని, వారి శ్రమను వృథా చేయొద్దన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పేరెంట్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలల బలోపేతానికి కృషి
పింగిళి శ్రీపాల్‌రెడ్డి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, (ఆంధ్రజ్యోతి) ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తున్నట్లు పీఆర్టీయూ-టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పింగిళి శ్రీపాల్‌రెడ్డి తెలిపారు. మహబూబాబాద్‌లో పీఆర్టీయూ-టీఎస్ 2025 నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంకా బద్రినారాయణ, మిర్యాల సతీష్‌రెడ్డి, వివిధ మండలాల బాధ్యులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే 'నారాయణపురం' సమస్య పరిష్కారం

● మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి



-కేసముద్రం మార్కెట్లో మాట్లాడుతున్న గంట సంజీవరెడ్డి

కేసముద్రం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : ఏడేళ్లుగా పట్టాదారు పాస్‌పుస్తకాల కోసం తిరుగుతున్న రైతుల సమస్యను కాంగ్రెస్ ప్రభుత్వం భూభారతి చట్టంతో పరిష్కార దిశగా చర్యలు తీసుకుంటోందని మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి అన్నారు. కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో భూప్రక్షాళన సమయంలో అధికారులు చేసిన పొరపాట్లకు మండలంలోని నారాయణపురం గ్రామంలో వందలాది మంది రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు అందకుండా పోయాయని తెలిపారు. అనేక సార్లు అప్పటి ప్రభుత్వానికి విజ్ఞప్తులు, ఆందోళనలు చేసినప్పటికీ పరిష్కారంకాలేదని తెలిపారు. ప్రస్తుత ఎమ్మెల్యే మురళీనాయక్ చొరవతో రెవెన్యూమంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీ బలరాంనాయక్, సీఎం సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహకారంతో గ్రామంలో రైతులకు పట్టాలు జారీ కాబోతున్నాయని తెలిపారు. టీపీసీసీ సభ్యుడు గుగులోత్ దస్రూనాయక్, డీసీసీ ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు, మాజీ జడ్పీటీసీ సురేందర్, సొసైటీ మాజీ చైర్మన్ బండారు వెంకన్న, ఎండీ.అయూబ్‌ఖాన్, చింతకుంట్ల యాదగిరి, చిదురాల వసంతరావు, పొలెపాక నాగరాజు, రావుల మురళి, వేముల శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి : సీపీఎం

నెల్లికుదురు, డిసెంబరు31 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ కోరారు. మండల కేంద్రంలోని విశ్రాంతి భవనంలో మంగళవారం సీపీఎం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. బీజేపీ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చకుండా ప్రజల్లో ఉన్మాదాన్ని రెచ్చగొడుతూ కాలయాపన చేస్తుందన్నారు. రాష్ట్రప్రభుత్వం ఇచ్చిన మీమీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తుందన్నారు. వివిధ రంగాలలో పనిచేస్తున్న కార్మికులను రెగ్యులరైజ్ చేయాలన్నారు. పేదలకు ఇండ్ల స్థలాలు కేటాయించి, ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలన్నారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు గునిగంటి రాజన్న, మండల కార్యదర్శి ఇసంపెల్లి సైదులు, బాబు గౌడ్, పుల్లయ్య, నర్సయ్య, ఉప్పలయ్య, ఎల్లయ్య, వీరయ్య, ఏకాంతం, వెంకన్న, తోట శ్రీను, దండెంపెల్లి కొమురయ్య పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఫెర్టిలైజర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఐలయ్య



ఇనుగుర్తి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : మండల ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ అండ్ సీడ్స్ అసోసియేషన్ నూతన కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కాసాని ఐలయ్యయాదవ్, ఉపాధ్యక్షుడిగా గంజి సురేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా దాసరి సంపత్, కోశాధికారిగా నూకల యాకయ్యను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి మహేందర్‌ను మర్యాదపూర్వకంగా నూతన కమిటీ బాధ్యులు కలిశారు.

సీపీఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శిగా అహ్మద్



మహబూబాబాద్ రూరల్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్) ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శిగా మహబూబాబాద్ పట్టణానికి చెందిన ముబీన్ అహ్మద్ నియమిస్తూ సంఘం కేంద్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు స్థితప్రజ్ఞ, శ్రీకాంత్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. మొబీన్ అహ్మద్ మహబూబాబాద్ ప్రిన్సిపల్ జిల్లా కోర్టు జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. తన నియామకానికి కృషి చేసిన కేంద్ర కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులకు మొబీన్ కృతజ్ఞతలు తెలిపారు.

జాతీయస్థాయి హాకీ పోటీలకు సాయిరాం ఎంపిక




కేసముద్రం, డిసెంబరు31 (ఆంధ్రజ్యోతి) : మధ్యప్రదేశ్ రాష్ట్రం బోపాల్‌లో జనవరి 2 నుంచి 7 వరకు నిర్వహించే ఎస్‌జీఎఫ్ అండర్ 14 జాతీయస్థాయి హాకీ పోటీలకు కేసముద్రం స్టేషన్ జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి బాదావత్ సాయిరాం ఎంపికైనట్లు హెచ్‌ఎం బందెల రాజు, పీడీ కొమ్ము రాజేందర్ తెలిపారు. ఇటీవలె కరీంనగర్ జిల్లా హుజురాబాద్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి క్రీడల్లో ప్రతిభకనబర్చి ఈ విద్యార్థి జాతీయస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థిని ఉపాధ్యాయ బృందం అభినందించింది.

పద్మశాలీ సంఘం గౌరవ అధ్యక్షుడిగా శ్రీరాములు



కేసముద్రం, డిసెంబరు31 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం మండల పద్మశాలీ సంఘం గౌరవ అధ్యక్షుడిగా పూరుగొండ శ్రీరాములు నుఎన్నుకున్నట్లు మండల అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గౌరవ సలహాదారులుగా సామల పెద్దనర్సయ్య, బొద్దుల జనార్ధన్, రాపోలు శ్రీనివాస్, రాపాక కుమారస్వామిలను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు.

టీఎస్-యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శిగా మల్లారెడ్డి



మహబూబాబాద్ ఎడ్యుకేషన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్-యూటీఎఫ్) రాష్ట్ర కార్యదర్శిగా సామ మల్లారెడ్డిని రెండవ సారి ఏకగ్రీవంగా నియమించినట్లుజిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు మురళీకృష్ణ, యాకూబ్ మంగళవారం తెలిపారు. నల్గొండ జిల్లాలో డిసెంబరు 28 నుంచి 30 వరకు జరిగిన సంఘం రాష్ట్ర 6వ మహాసభల్లో మల్లారెడిని రాష్ట్ర కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన మల్లారెడ్డి కంబాలపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్ స్కూల్ అసిస్టెంటుగా విధులు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర కార్యదర్శిగా రెండో సారి అవకాశం కల్పించిన రాష్ట్ర నాయకులకు మల్లారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

'5 నుంచి 9వ తరగతి హాస్టల్ సీట్లకు దరఖాస్తు చేసుకోండి'

కేసముద్రం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రంతో సహా రాష్ట్రంలోని గిరిజన సంక్షేమ శాఖ గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో ప్రవేశం కోసం ఆన్‌లైన్‌లో వచ్చే ఫిబ్రవరి 1 వరకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సుజాత మంగళవారం తెలిపారు. వీటితోపాటు 6 నుంచి 9వ తరగతి వరకు మిగిలిన సీట్లకు కులం, ఆదాయం, స్టడీ, ఆధార్, ఫొటోతో ఆన్‌లైన్ సెంటర్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఇద్దరికి తీవ్ర గాయాలు

కొత్తగూడ, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని కిష్టాపురం క్రాస్‌రోడ్డు వద్ద మంగళవారం జరిగింది. వివరాలు ప్రకారం కార్లాయి గ్రామానికి చెందిన పిడబోయిన సందీప్, గుమ్మడి కృష్ణ ద్విచక్రవాహనంపై కార్లాయి నుంచి కొత్తగూడకు వస్తున్నారు. మూడుచెక్కల తండాకు చెందిన బానోత్ సుక్య ద్విచక్రవాహనంపై పోలారం వెళుతున్నాడు. కిష్టాపురం క్రాస్ రోడ్డు వద్ద రెండు ద్విచక్రవాహనాలు వేగంగా ఎదురెదురుగా ఢీకొట్టుకున్నాయి. సక్యాకు స్వల్పగాయలు కాగా.. సందీప్, కృష్ణకు తీవ్రగాయాలు కావడంతో 108లో నర్సంపేట ఆస్పత్రికి పంపించారు.

'ప్రభుత్వ స్థలాలను కాపాడాలి'



మునిసిపల్ కమిషనర్ రవీందర్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న సీపీఎం నాయకులు

మహబూబాబాద్ టౌన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ప్రభుత్వస్థలాలు అన్యక్రాంతం కాకుండా కాపాడి, అక్కడ వీధి వ్యాపారుల జోన్‌గా ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు సమ్మెట రాజమౌళి విజ్ఞప్తి చేశారు. మహబూబాబాద్ పట్టణంలోని ఓసీ క్లబ్ వద్ద సీపీఎం టూటౌన్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఆందోళన చేపట్టారు. అనంతరం మునిసిపల్ కమిషనర్ నోముల రవీందర్‌కు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తొర్రూరు బస్టాండ్ వద్ద ఖాళీ స్థలం, ఓస్సీ క్లబ్ స్థలం భూ కబ్జాదారులు ఆక్రమించుకోవాలని ప్రయత్నిస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఓసీ క్లబ్ స్థలం, తొర్రూరు బస్టాం డ్ వద్ద ఖాళీ స్థలాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని వీధి వ్యాపారుల జోన్‌గా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. హేమానాయక్, నక్క సైదులు, బానోత్ వెంకన్న, ఎర్ర శ్రీను, ఎస్కే. తజ్జు, పులుగుజ్జు వెంకన్న, మందుల మహేందర్, లాలయ్య రాజేష్ పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి..

మహబూబాబాద్ మునిసిపల్ 17వ వార్డు ఉన్నటువంటి హిందూ శ్మశానవాటికలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం పట్టణ కమిటీ సభ్యులు తోట శ్రీనివాస్, తోట యాకయ్య కోరారు. ఈ మేరకు స్థానిక మునిసిపల్ కమిషనర్‌కు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ హిందూస్మశాన వాటికలో తాగునీటి, విద్యుత్ సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రమేష్, ఉపేందర్, దేవేందర్, వెంకటేష్, గోపాల్, ముస్తాఫా, అన్వేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలను ప్రతీ ఒక్కరు గౌరవించాలి

● జిల్లా కోర్టు సీనియర్ సివిల్ జడ్జి సురేష్

డోర్నకల్, డిసెంబరు31 (ఆంధ్రజ్యోతి) : దేశంలోని చట్టాలు, న్యాయవ్యవస్థను ప్రతీ ఒక్కరు గౌరవించాలని మహబూబాబాద్ జిల్లా కోర్టు సీనియర్ సివిల్ జడ్జి సురేష్ అన్నారు. మంగళవారం ముల్కలపల్లిలో మహబూబాబాద్ జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన న్యాయ విజ్ఞాన వేదిక సదస్సుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అందరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. రోజురోజుకు పెరిగిపోతున్న రోడ్డు ప్రమాదాల నివారణకు చట్టాలను గౌరవించడం ఒక్కటే మార్గమన్నారు. యువత డ్రగ్స్, గంజాయి వంటి మత్తుపదార్థాల జోలికి వెళ్లకూడదని సూచించారు. పటిష్ఠమైన చట్టాలు ఉన్నందువల్ల వాటిని అతిక్రమించిన వారు శిక్షార్హులవుతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్సై వంశీధర్, ముల్కలపల్లి గ్రామస్థులు పాల్గొన్నారు.

పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, డిసెంబరు31 (ఆంధ్రజ్యోతి) : మైనార్టీ అభ్యర్థులు వివిధ పోటీపరీక్షల ఉచిత శిక్షణకు ఈనెల 16వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర మైనార్టీస్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో గ్రూపు-1, 2, 3, 4, రైల్వే రిక్రూట్‌మెంట్‌బోర్డు, స్టాఫ్ సెలక్షన్‌కమీషన్, బ్యాంకింగ్ మొదలైన ఉద్యోగ నియామక పోటీ పరీక్షలకు నాలుగు నెలలు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. మహబూబాబాద్ జిల్లాలోని అర్హులైన ఆసక్తిగల మైనార్టీ (ముస్లింలు, క్రైస్తవులు, బౌద్ధులు, సిక్కులు, జైనులు, పార్సీలు) విద్యార్హత సర్టిఫికెట్లతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను కలెక్టర్ కార్యాలయంలోని జిల్లా మైనార్టీ కార్యాలయంలో అందజేయాలన్నారు. వివరాలకు సెల్‌నెంబర్ : 91825 40680, 9573769507 లను సంప్రదించాలన్నారు.

'కొత్త' సంబురం

(5వ పేజీ తరువాయి)



మహబూబాబాద్ బేకరీలో భారీగా కొనుగోలు చేస్తున్న వినియోగదారులు

కేంద్రాల్లో కూడా ఒకరోజు ముందే పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ.. కొత్త సంవత్సరాన్ని స్వాగతించే ముగ్గులను వేయడానికి రంగుల దుకాణాలు కళకళలాడాయి. న్యూ ఇయర్ గ్రీటింగ్స్ దుకాణాలు, కేక్‌ల బేకరీలు కిక్కిరిసాయి.

మటన్, చికెన్, చేపలకు యమ గిరాకీ..

ప్రతినిత్యం పండుగలకు.. పబ్బాలకు.. ప్రత్యేకంగా వండుకునే మటన్, చికెన్, చేపలకు కొత్త సంవత్సరం యమ గిరాకీ తెచ్చిపెట్టింది. కొందరు వీకెండ్ తెచ్చుకునే నాన్‌వేజ్‌ను కొత్త సంవత్సరం పేరిట స్పెషల్ ఆర్డర్‌లతో దాబాలు, హోటళ్లకు క్యూ కట్టారు. ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలోనైతే మరి యువత రద్దీ కన్పించింది. రోజు ఇంట్లో తినేదే కదా.. కాస్త వెరైటీ ఉండాలని కాబోలు... జంకుఫుడ్.. ఫాస్ట్‌ఫుడ్‌తో జిహ్వారుచులను నెమరవేసుకున్నారు. వీటికి కాస్త డ్రింక్స్ యాడ్ చేసి మత్తులోనూ.. మునిగి తేలారు. ఈ సారి కొత్త సంవత్సరం కలిసి వచ్చిన వీకెండ్ తరహాలో మంగళ, బుధవారాలు పాతవత్సరానికి వీడ్కోలు.. కొత్త సంవత్సరానికి స్వాగతం పలికే అవకాశం రావడంతో ఇక ఇంటిల్లి పాదికి నాన్‌వేజ్ వంటకాల రుచి తప్పలేదు. దీంతో చివరి రోజు ఉదయం నుంచి రాత్రి వరకు చికెన్, మటన్ షాపులతో పాటు చేపల మార్కెట్లో సందడి కన్పించింది. విక్రయాలు కూడా సాధారణ రోజుల కంటే ఎక్కువగా పెరిగాయి.

స్టడీ మెటీరియల్ పంపిణీ

కురవి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : బలపాల జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులకు హెచ్‌ఎం నర్సింహారెడ్డి స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. కాంపెల్లి శివారు సక్రాం నాయక్‌తండాకు చెందిన బాదావత్ మాన్‌సింగ్ ఆర్థిక సాయంతో 16మంది విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందించారు. ఉపాధ్యాయులు ప్రసాద్, మధుసూదన్‌రెడ్డి, గోపికృష్ణ, సీతారాములు, జయశ్రీ, మోతీలాల్, షకీరా బేగం, శ్రీనివాసులు, రాజేశ్వర్ పాల్గొన్నారు.

'పద్మావతి ఎక్స్‌ప్రెస్ రైల్‌కు డోర్నకల్‌లో హాల్టింగ్‌కు సహకరించండి'

డోర్నకల్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్-తిరుమతి మధ్య నడిచే పద్మావతి సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు డోర్నకల్‌రైల్వేజంక్షన్‌లో హాల్టింగ్ సౌకర్యం కల్పించేలా కేంద్ర హోంశాఖ సహాయమంత్రి సంజయ్ చొరవ తీసుకోవాలని బీజేపీ పట్టణ కార్యదర్శి లకన్‌వ్యాస్ కోరారు. ఈ మేరకు హైదరాబాద్‌లో సంజయ్ నివాసగృహంలో వినతిపత్రం అందించినట్లు లకన్‌వ్యాస్ తెలిపారు.



పీఎస్‌ను తనిఖీ చేస్తున్న కృష్ణకిషోర్

నేర నియంత్రణకు అప్రమత్తంగా ఉండాలి

● తొర్రూరు డీఎస్పీ కృష్ణకిషోర్

మరిపెడ, డిసెంబరు31 (ఆంధ్రజ్యోతి) : నేర నియంత్రణకు అప్రమత్తంగా ఉండాలని తొర్రూరు డీఎస్పీ కృష్ణకిషోర్ అన్నారు. మంగళవారం మరిపెడలోని పీఎస్‌ను డీఎస్పీ తనిఖీ చేశారు. స్టేషన్ రికార్డులను తనిఖీ చేసి జీడీ బుక్, లాకప్, రైటర్, రిసెప్షన్ కౌంటర్ గదులను పరిశీలించారు. నేరస్థులపై ఆరా తీశారు. క్రైంరేట్ అడిగి తెలుసుకున్నారు.అనుమానాస్పద వ్యక్తులపై నిఘా ఉంచాలని సూచించారు. సీఐ రాజ్‌కుమార్‌గౌడ్, ఎస్సైలు బోలగాని సతీశ్, సంతోశ్, సిబ్బంది ఉన్నారు.

పద్మశాలీలు అన్నిరంగాల్లో బలోపేతం కావాలి

● సంఘం జిల్లా అధ్యక్షుడు వేముల వెంకన్న



వర్తక సంఘం భవనంలో మాట్లాడుతున్న వెంకన్న

గార్ల డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా పద్మశాలి కులబాంధవులు రాజకీయంగా, ఆర్థింగా బలోపేతం కావాలని సంఘం జిల్లా అధ్యక్షుడు వేముల వెంకన్న పిలుపు నిచ్చారు. మంగళవారం స్థానిక వర్తక సంఘం భవనంలో మండల పద్మశాలి సంఘం జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ పార్టీలు జనాభా దామాషా పద్ధతిలో పద్మశాలి కులస్తులకు సీట్లు కేటాయించాలన్నారు. మహబూబాబాద్‌లో టెక్స్టైల్ పార్కు నిర్మాణం కోసం పద్మశాలి కార్మికులు కలిసికట్టుగా ప్రభుత్వంపై పోరాటం చేయాలన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు అలవాల రామకృష్ణ, కోట ఉత్తరయ్య, మండల నాయకులు చిలక నర్సయ్య, చిలక శ్రీను, జంగం శ్రీను, గుండేటి వీరభద్రం, అలవాల సత్యవతి, బేతి వెంకటేశ్వర్లు, దొంతు పురుషోత్తం, వేముల రవీందర్, జిల్లా కోర్టు ఏజీపీ తాటిపాముల సునిత, గంజి అనసూర్య, ఊరుకొండ సుందర్, నాగరాజు పాల్గొన్నారు.

పేపర్ బాయ్స్‌కు స్వెటర్ల పంపిణీ

తొర్రూరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): నిత్యం వేకువజామునే లేచి పేపర్‌ను ఇంటింటికి చేర్చే బాయ్స్ కృషి ఎంతో అభినందనీయమని లయన్స్ క్లబ్ ఆఫ్ తొర్రూరు వినాయక్ ఫ్రెండ్స్ అధ్యక్షుడు పద్మం యాదగిరి అన్నారు. మంగళవారం వినాయక ఫ్రెండ్స్ క్లబ్ ఆధ్వర్యంలో 32 మంది పేపర్ బాయ్స్‌కు స్వెటర్లు పంపిణీ చేశారు. అనంతరం పండ్ల పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో క్లబ్‌సభ్యులు రేగూరి వెంకన్న, కందగట్ల సోమశేఖర్, శ్రీధర్, సోమయ్య, శ్రీనాథ్, ప్రకాశ్, స్వామి, పేపర్‌బాయ్స్ ఇన్‌చార్జి బి. సోమయ్య, మాలిక్ ఉన్నారు.

సిబ్బంది చేతివాటంపై తహసీల్దార్ సీరియస్

మరిపెడ, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : మరిపెడ సివిల్ సప్లయ్ గోదాం సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారని ఆరోపణల మేరకు తహసీల్దార్ సైదులు ఆ గోదాంను మంగళవారం తనిఖీ చేశారు. కొందరు డీలర్లవద్ద డబ్బులు తీసుకొని వారికి సన్న బియ్యం సరఫరా చేస్తున్నారని డబ్బులు ఇవ్వని డీలర్లకు చుక్కలు చూపెడుతున్నారని తెలియడంతో తహసీల్దార్ తనిఖీ చేసి సిబ్బందిని మందలించారు. తహసీల్దార్ వెంట ఆర్ఐ శరత్, స్థానిక గోదాం ఇన్‌చార్జి ఉన్నారు.

బీఆర్ఎస్ కార్యకర్తలకు అండగా ఉంటా

● మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

తొర్రూరు రూరల్, డిసెంబరు31 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ కార్యకర్తలకు ఎల్లప్పుడు అండగా ఉంటామని మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. మంగళవారం పెద్దమంగ్యా తండాలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు జాటోత్ బీకునాయక్ ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించి, మాట్లాడారు. బీఆర్ఎస్ బలోపేతం కోసం, పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం, వెల్లికట్టె ఎంపీటీసీగా బీకునాయక్ చేసిన సేవలు మరువలేనివన్నారు. మాజీ ట్రైకర్ చైర్మన్ రామచంద్రనాయక్, జీసీసీ మాజీ చైర్మన్ గాంధీనాయక్, సీనియర్ నాయకుడు డాక్టర్ సోమేశ్వర్‌రావు, మండల అధ్యక్షుడు సీతారాములు, మాజీ ఎంపీపీ తూర్పాటి అంజయ్య, జడ్పీటీసీ మాజీ సభ్యుడు మంగళపల్లి శ్రీనివాస్, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ శ్రీనివాస్, పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రదీప్‌రెడ్డి, కుర్ర శ్రీనివాస్, కాలునాయక్, జాటోత్ సురేష్, మాజీ సర్పంచ్ శారద రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మునిసిపల్ ఉత్తమ డ్రైవర్లకు ఘన సన్మానం

మహబూబాబాద్ టౌన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : మానుకోట మునిసిపాలిటీలో పని చేస్తున్న ఉత్తమ వాహన డ్రైవర్లను మంగళవారం ఘనంగా సన్మానించారు. పారిశుధ్య వాహనాలు నడుపుతున్న 16 మందిని ఉత్తమ డ్రైవర్లుగా ఎంపిక చేసి, వారికి మెమెంటోలను అందించి అభినందించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన మునిసిపల్ చైర్మన్ రాంమోహన్‌రెడ్డి మాట్లాడారు. సమయపాలన పాటిస్తూ ఎలాంటి ప్రమాదాలకు తావులేకుండా నడిపిన వాహన డ్రైవర్లను ఎంపిక చేసి అభినందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ మార్నేని వెంకన్న, కమిషనర్ నోముల రవీందర్, కోఆప్షన్ సభ్యులు నిమ్మల శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కరుణాకర్, రాజేష్, శ్రీనివాస్, వెహికల్స్ ఇన్‌చార్జి సత్యనారాయణ పాల్గొన్నారు.



ఉత్తమ డ్రైవర్లను సత్కరిస్తున్న చైర్మన్ పాల్వాయి రామమోహన్‌రెడ్డి, అధికారులు

టెన్త్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు షురూ

● స్నాక్స్ కోసం ఆర్థిక సాయం చేసిన బీఎస్ఎఫ్ జవాన్

కొత్తగూడ, డిసెంబరు31 (ఆంధ్రజ్యోతి) : పొగుళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు హెచ్‌ఎం విష్ణువర్ధన్‌రావు మంగళవారం పేర్కొన్నారు. విద్యార్థులకు అల్పాహారం కింద 20రోజులు స్నాక్స్ అందించేందుకు బీఎస్ఎఫ్ జవాన్ బోళ్ల సునిల్ ఆర్థిక సహాయం చేశారు. సునిల్‌ను స్ఫూర్తిగా తీసుకుని మరికొందరు దాతలు విద్యార్థులకు స్నాక్స్ అందించేందుకు ఆర్థిక సహాయం చేయాలని కోరారు. ఉపాధ్యాయులు నెల్లుట్ల భాస్కర్, సుమన్, సుధాకర్, రాజ్‌కుమార్, నర్సయ్య, సాంబయ్య, రాంబాబు, జుమ్మలాల్, సూరయ్య, శ్రీలత, మదన్‌మోహన్, మాదవి, విద్యార్థులు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధిలో యువత పాత్ర కీలకం

సీరోలు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : సమాజాభివృద్ధిలో యువత పాత్ర కీలకమని, యువకులు హక్కులతో పాటు బాధ్యతలు కలిగి ఉండాలని ఎస్సై నగేష్ అన్నారు. కాంపల్లిలో మంగళవారం అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు కామ సంజీవరావు ఆధ్వర్యంలో పౌరహక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని 'హక్కులు-బాధ్యతలు' అనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై నగేష్ మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ శారద, ఏఎస్‌డబ్ల్యూవో శివవర్మప్రసాద్, కొప్పుల వెంకట్‌రెడ్డి, బిక్షం పాల్గొన్నారు.

బయ్యారంలో కలెక్టర్ పర్యటన

బయ్యారం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలో మంగళవారం జిల్లా కలెక్టర్ పర్యటించారు. బయ్యారం, కొత్తపేట, నామాలపాడు పంచాయతీల పరిధిలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఎక్కడ పడితే అక్కడ ఇష్టానుసారంగా ధాన్యం నిల్వలు చేయరాదన్నారు. కేంద్రాల్లో ఒకేచోటా ధాన్యం నిల్వ చేస్తే రైతులందరికి సౌలభ్యంగా ఉంటుందన్నారు. పీఏసీఎస్ సొసైటీ చైర్మన్ మధుకర్ రెడ్డితో పాటు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

తలారి వెంకటేశ్వర్లు సేవలు మరువలేనివి

● సీపీఐ మునిసిపల్ ఫ్లోర్ లీడర్ అజయ్‌సారథిరెడ్డి

మహబూబాబాద్ టౌన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): తన తుదిశ్వాస విడిచేంత వరకు పేదల కోసం పోరాడిన తలారి వెంకటేశ్వర్లు సేవలు మరువలేనివని సీపీఐ మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి అన్నారు. మహబూబాబాద్ పట్టణంలోని వివేకానంద సెంటర్‌లో సీపీఐ ఆధ్వర్యంలో దివంగత వెంకటేశ్వర్లు 12వ వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. ఆయన ఫ్లెక్సీకి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణ కార్యదర్శి పెరుగుకుమార్, రేషపల్లి నవీన్, అశోక్, హర్షవర్ధన్, మల్లికార్జున్, బాదావత్ బాలాజీ, మల్లయ్య, కుమారి, గాదె శ్యాంప్రసాద్, రమేష్, సత్యం, భద్రయ్య, వికాస్, నర్సమ్మ, ఐలయ్య, మల్లయ్య పాల్గొన్నారు.

ఆరు బయట వేడుకలకు అనుమతులు లేవు

● గూడూరు సీఐ బాబురావు

గూడూరు, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : ఆరు బయట నూతన సంవత్సర వేడుకలకు అనుమతులు లేవని, ఎక్కువమంది వ్యక్తులు గుమికూడడం నిషేధమని గూడూరు సీఐ బాబురావు అన్నారు. గూడూరు జాతీయ రహదారిపై మంగళవారం సీఐ బాబురావు, ఎస్సై గిరిధర్‌రెడ్డిలు సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ, డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. మద్యంతాగి వాహనాలతో రోడ్లపైకి రాకూడదని హెచ్చరించారు. డీజే సౌండ్‌సిస్టంకు అనుమతులు లేవని చెప్పారు. రోడ్లపై గుంపులు.. గుంపులుగా చేరి అల్లర్లకు పాల్పడడం, వాహనాలపై తిరిగితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

పశుగణన త్వరగా పూర్తి చేయాలి

జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి కిరణ్‌కుమార్



కొత్తగూడలో మాట్లాడుతున్న కిరణ్‌కుమార్

కొత్తగూడ, డిసెంబరు31 (ఆంధ్రజ్యోతి) : పశుగణన త్వరగా పూర్తి చేయాలని, రైతులు కిసాన్ క్రెడిట్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి కిరణ్‌కుమార్ సూచించారు. కొత్తగూడలోని ప్రాథమిక పశు వైద్యకేంద్రంలో పశు గణన, కిసాన్ క్రెడిట్ కార్డుపై మంగళవారం సమీక్ష సమావేశంలో నిర్వహించారు. వైద్యులు శ్రీకాంత్, నరేష్, జిల్లా పశు గణన నోడల్ అధికారి డాక్టర్ శ్రావణ్, జిల్లా సూపర్‌డెంట్ కోటిరెడ్డి, వీఏ అరుణ్‌కుమార్, పశు గణన ఎన్యూమరేటర్లు అనూష, చీనూరి వెంకన్న, రాహుల్, సిద్దబోయిన కిషన్, శివ, హిందు, రైతులు పాల్గొన్నారు.